ప్రజాశక్తి

శుక్రవారం 14 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పాలకుల ప్రజాకంటక విధానాలపై **పోరాటం చేయాల్సిందే..** ▶ 5లో

సమన్వయ లోపమేనా.?

- సిఎం పర్యటనలో 'బాలినేని' ఉదంతంపై తీవ్ర చర్చ
- విలువల కోసం ఎంతటివారినైనా ఎదిరిస్తానన్న మాజీ మంత్రి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గణతంత్ర వేడుకల్లో ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరుపై అసంతృప్తితో ప్రజాప్రతినిధులు అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. జరిగిన తప్పి దాన్ని గుర్తించిన కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రజాప్రతినిధులకు జరిగిన దానిపై ఏదో రూపంలో సంజాయిషీ ఇచ్చుకున్నారు. జరిగిన తప్పిదం ఏమిటో తెలిసిందే..

తాజాగా సిఎం జగన్ పర్యటనలో పార్టీలో సీనియర్ నేతగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి కారును హెలీప్యాడ్ వద్దకు అనుమతించలేదు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా సిఎం పర్యటనకు హాజరుకాకుండా ఒంగోలు బయలుదేరి చీమకుర్తి వరకూ రావడం.. మధ్యలో సిఎంఒ జోక్యంతో

బాలినేనితో 'ఇబిసి నేస్తం నిధుల విడుదల' బటన్ నొక్కిస్తున్న సిఎం జగన్ (ఫైల్)

ఆయన వెనుదిరిగి ఆఖరు నిమిషంలో వేదికపైకి వచ్చారు. సిఎం జగన్ వ్యూహాత్మకంగా బాలినేనితోనే బటన్ నొక్కించి వెళ్లిపోయారు.

ఈ వ్యవహారంపై సిఎం జగన్ కూడా దృష్టి సారించాల్సి వచ్చింది. మంత్రి సురేష్‌తో కాసేపు చర్చించాక నడపాల్సిన వ్యవహారాన్ని సిఎం జగన్ సిఎంఒకు ఉపదేశించారు. మార్కాపురంలో ఆయన కారును అడ్డుకోవడం.. అక్కడ నుంచి వెనుదిరిగి దాదాపుగా 75 కిలోమీటర్లు దూరం వచ్చేశారు. ఈ సంఘటన సిఎం పర్యటనలో హైలైట్‌గా మారింది. తీవ్ర చర్చకు దారితీసింది. వేదికపైనా బాలినేని లేకపోవడంతో జిల్లా నేతల్లోనూ ఏదో జరిగిందనే ▶ 2లో

ఎంతటి వారినైనా ఎదిరిస్తా..: బాలినేని

ఈ సంఘటనపై మాజీ మంత్రి బాలినేని గురువారంనాడు స్పందించారు. తాను విలువలతో కూడిన రాజకీయం చేస్తున్నానని, దానికి ఇబ్బంది కలిగితే ఎంతటివారినైనా ఎదిరిస్తానని హెచ్చరించారు. ఆయన హెచ్చరికలు ఎవరిని ఉద్దేశించినవి? అన్నది కూడా పార్టీలో చర్చకు దారితీస్తోంది. ఏదేమైనా సిఎం పర్యటనలో బాలినేని ఉదంతమే కీలక అంశంగా మారింది.

సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని జేపీసీ జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు హెచ్చరించారు. అమరావతి రాష్ట్ర కమిటీ మలిదశ ఉద్యమ కార్యాచరణంలో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు కొనసాగుతూనే వున్నాయి. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు, పెండింగ్ సమస్యలపై అన్ని శాఖల ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ, సమస్యలతో కూడిన కరపత్రాలు సర్వే కార్యాలయం, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాయం, జిల్లా గిడ్డంగుల శాఖ కార్యాలయం, ఉద్యోగులకు, ఆర్‌డీఓ కార్యాలయ సిబ్బందికి, జిల్లా రిజిస్ట్రార్, ట్రెజరీ కార్యాలయాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కోశాధికారి బి ఓంకార్, సిటీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మహబూబ్ బాషా, ఆర్ సుమంత్ కుమార్ మాట్లాడుతూ ఈ పోరాటం న్యాయమైన తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆగదని ప్రసంగించారు. ఉద్యోగుల పెండింగ్ డీఏ, పిఆర్‌సీ ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు కేటాయించిన బడ్జెట్‌లోని మొత్తాలను సకాలంలో ఎందుకు చెల్లించదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారి ఎం శ్రీనివాసరావు, బి సుశీల, పార్వతి, జీ అనిత, కె సత్యమంగలాంబ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు

సమన్వయ లోపమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

ఉత్కంఠ కనిపించింది. అంతా నిరుత్సాహంగా కనిపించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మరింత ఒత్తిడికి గురయ్యారు. బాలినేని తిరిగి వేదికపైకి వచ్చేదాకా ఆయన ప్రశాంతంగా కనిపించలేదు. సిఎం సభలో కనీసం మాట్లాడలేదు. కనీసం రెండు మాటలు చెప్పే ఆలోచన కూడా ఆయనలో కనిపించలేదు. బాలినేని వెళ్లిపోయాక ఎస్పీ మల్లికాగర్గ్ కూడా పలుమార్లు బాలినేనికి ఫోన్ చేశారు. జరిగిన ఉదంతాన్ని అవమానంగా భావించిన బాలినేని స్పందించలేదు. ఈ సంఘటనకు కారణం ఎక్కడుంది? సమన్వయ లోపమా? బాధ్యతల్లో నిర్లక్ష్యమా? అనేదీ తేలాల్సి ఉంది. ఎందుకంటే ఇదే పోలీసులు పాలకపక్ష నేతలకు సాధారణ సమయాల్లో కాన్వాయ్‌లు తీసుకుపోతున్నారు. నిబంధనలను కూడా పక్కనబెడతారు. వారి పోస్టింగుల కోసం ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు తిరుగుతుంటారు. అదే సిఎం పర్యటనల్లో మాత్రం అనవసర యాగీలు చేస్తుంటారు. ఇంకా చెప్పాలంటే అంతా ఓవర్‌యాక్షనే కనిపిస్తుంది. ప్రజలపైనా తీవ్ర ఆంక్షలు విధిస్తారు. రాజకీయ పార్టీలను కదలకుండా గృహనిర్బంధాలు చేస్తున్నారు. ఇవన్నీ ఎక్కడ నుంచి అమలు చేస్తున్నారనేదీ ఎవరికీ చెప్పరు. అవసరం లేని పనులన్నీ సిఎం పర్యటనలోనే కనిపిస్తాయి. ఇప్పుడు బాలినేని వ్యవహారం రాజకీయవర్గాల్లోనే తీవ్ర చర్చకు తావిస్తోంది. పోలీసుల తీరుపైనే పెద్ద చర్చ సాగుతోంది. ఆయన్నే అడ్డుకోవడం ఏమిటన్నది ఇప్పుడు అందరిలోనూ ప్రశ్న. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన సిఎం వద్దకు వెళ్లడానికి అభ్యంతరం ఏమీ లేదు. ప్రోటోకాల్‌లోనూ ఎటువంటి సందేహం లేదు. ఆయన వాహనాన్ని హెలీప్యాడ్ వద్దకు అనుమతించలేనంత పరిస్థితి ఏమిటనేదీ చర్చగా మారింది. హెలీప్యాడ్ వద్దకు ఎందుకు అనుమతించలేదన్నదీ పోలీసుశాఖ నుంచీ స్పష్టత లేదు. ఈ వ్యవహారంపై బాలినేని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసుశాఖ తీరుపైనే ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల రోజునే పోలీసుశాఖ వైఫల్యాన్ని ప్రస్తావించిన ఆయన మార్కాపురం ఘటనతో తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఎస్పీ సూచన మేరకే హెలీప్యాడ్ వద్దకు ఎవరి వాహనాలు అనుమతించాలన్నది అడ్డుకున్న ప్రాంతంలో ఉన్న అధికారులు స్పష్టంగా పాటించారని సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల్లో స్పష్టత ఉందా? నిబంధనల ప్రకారం పోయారా? అనేదీ చూడాలి. హెలీప్యాడ్ వద్దకు సిఎం కాన్వాయ్‌తో పాటు ఇంకా ఎవరి వాహనాలు అనుమతించారు? మంత్రులకు ఎలాంటి అనుమతి ఉంది? ఎమ్మెల్యేలకు ఎలాంటి నిబంధనలు ఉన్నాయనేదీ చూడాలి. ఏదేమైనా ఈ సంఘటనకు సమన్వయలోపమే కారణమని భావిస్తున్నారు. సిఎంఒ నుంచి బాలినేనికి జరిగిన తప్పిదంపై వివరణ కూడా ఇచ్చారు. తదుపరి చర్యలు ఎవరిపై ఉంటాయి? దీన్ని ఇంతటితో వదిలేస్తారా? అన్నదీ చర్చగా మారింది. ఇక ఈ వ్యవహారం పార్టీలోనూ పెద్ద అగాధం పెంచింది. మార్కాపురంలో పర్యటన వ్యవహారం మొత్తం మంత్రి ఆదిమూలపు సురేష్ చూశారు. ఇప్పుడు ఈ సంఘటనపై ఆయన కూడా మదనపడుతున్నారు. అసలే ఇద్దరి మధ్య సజీవ సంబంధాలు లేవు. ఈ సంఘటన మరింత ఇబ్బందిగా మార్చిందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

విద్యార్థుల అంతర్జాతీయ ట్రైనింగ్ పూర్తి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ యునివర్సిటీ ఐడిపి ప్రోగ్రామ్‌లో భాగంగా బాపట్ల ఫుడ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు అంతర్జాతీయ ట్రైనింగ్ పూర్తి చేశారని కళాశాల అసోసియేట్ డీన్ రాధా తెలిపారు. ఈ సంధర్భంగా గురువారం విద్యార్థులను కళాశాలలో అభినందించారు. ఫిబ్రవరి, మార్చి రెండు నెలల్లో వీరు అమెరికా,ఫిన్లాండ్, మలేషియా, థాయిలాండ్, తైవాన్, దేశాలలోని ప్రముఖ యూనివర్సిటీల్లో అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ పొందారన్నారు. ఈ ట్రైనింగ్ ద్వారా ఎంతో అనుభవాన్ని గడించామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఐడిపి ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డీన్ మణి, ఆచార్యులు విమలా బీర, బ్లేస్సి, సత్యన్నారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ముప్పలనేని

ప్రజాశక్తి-బాపట్ల: మహిళా ఇంజనీరింగ్ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉచిత కంటి, దంత, కాస్మోటాలజీ, హిమోగ్లోబిన్ శాతం, బ్లడ్ గ్రూప్, రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో బాపట్లకు చెందిన సిరి దంత వైద్యశాల, ఏపీ ఆప్టికల్స్, రీజియన్ ఫిజియోతెరఫి, యూపిహెచ్‌సి, విబి కాలనీ వైద్యులు, 5వందల మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవిశేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీనివాసరావు, జాతీయ సేవా విభాగం అధికారులు కృష్ణకుమారి, కళ్యాణి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపల్ రవి కుమార్

కార్పొరేట్ రంగంలో అవకాశాలు: ప్రిన్సిపల్

ప్రజాశక్తి-చీరాల

కార్పొరేట్ రంగం విస్తరణతో అవకాశాలు మెండుగా ఉన్నాయని, అయితే వాటిని దక్కించుకోవడానికి కావలసిన నైపుణ్యాలు లేకపోవడం వలన అనేకమంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగులుతున్నారని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ పేర్కొన్నారు. సిఎస్ఇ, ఇసి సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలనే ఒక ప్రయోగశాలగా మార్చుకుని తమ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, పతకాలు, అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఓడిలు డాక్టర్ సౌజన్య, డాక్టర్ బషీరా, డాక్టర్ శ్రీకాంత్, ప్రకాష్‌రాజ్, సూర్యనారాయణ, ప్లేస్ మేట్ ఆఫీసర్ బాజీ, విద్యార్థులు సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

అలసత్వం వహిస్తే చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి-చీరాల

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. చీరాల పట్టణంలో 25 సచివాలయాల అడ్మిన్లతో గురువారం కమిషనర్ రామచంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ చాంబర్ జరిగిన నిర్వహించిన సమావేశంలో సచివాలయాల అడ్మిన్లకు కమిషనర్ పలు సూచనలు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయాలకు వచ్చే ప్రజల ఇబ్బందులు పెట్టకుండా వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, వాలంటరీలు సమన్వయంతో పనిచేసి చీరాల మున్సిపాలిటీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వార్డుల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్అదాలత్

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణంలోని సబ్ కోర్టు హాలులో మే 13న జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఈ నెల 15వ తేదీన రేపల్లె పట్టణ, రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ లోక్అదాలత్‌లో కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించి కక్షిదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆరోగ్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఓరల్ గ్లూకోస్ టోలరెన్స్ టెస్ట్‌పై ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. గర్భిణులకు డయాబెటిస్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాలిని మాట్లాడుతూ గర్భిణులను ప్రతినెల విధిగా ఆసుపత్రికి తీసుకురావాలని ఓజిటిటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఐదు ఆరు నెలల గర్భిణులను తప్పకుండా వైద్యశాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి దేవనమ్మ, అరుణ, ఎంఎల్‌హెచ్‌పిలు అనూష, నూర్జహాన్, అశ్విని పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: భూమన

ప్రజాశక్తి-దరిశి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల పక్షపాతిగా నిలిచారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటరు భూమా కరుణాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు కమ్యూనిస్టులు, నక్సలైట్లతో గతంలో సంబంధాలున్నాయని కార్ల్‌మార్క్సు పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని చెప్పారని, అదేపని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని కొనియాడారు. దేశంలో 15 మంది దగ్గర ఉన్న సంపద పంచితే పేదలైన 120 కోట్ల మందికి 15 సంవత్సరాలపాటు సరిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి

మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటరు భూమా కరుణాకర్‌రెడ్డి

జగన్ బటన్ నొక్కి రూ.2.25 లక్షల కోట్లు పేదలకు పంచారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పేదలందరూ జగన్మోహన్‌రెడ్డికే పట్టం కడతారని పేర్కొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, భూమన ప్రభాకర్‌రెడ్డితో పాటు పరిశీలకులు సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి మండలాల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, జెఎసి చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పేదల పక్షపాతి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, రాబోయే ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రి అవుతారని, సంక్షేమ పథకాలు అందినవారందరూ మరలా ఓట్లు వేయాలని మండల వైస్‌ఎంపిపి సోము దుర్గారెడ్డి అన్నారు. మండలంలోని పొతకమూరు పంచాయతీలో సర్పంచ్ బోట్లా వెంకయ్య అధ్యక్షతన ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-దరిశి: జగనన్న ఇళ్లు అధికారులు త్వరలో పూర్తి చేయాలని తాళ్ళూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బూచేపల్లి వెంకాయమ్మ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-దరిశి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దరిశి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాత్రి కురిచేడు రోడ్‌లోని కరిముల్లా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపి ప్రార్థనలో పాల్గొన్నారు. డాక్టరు ఎస్‌ఎం బాషా, ముస్లిములు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు: రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సచివాలయ కన్వీనర్లు గృహ సారథులే కీలకపాత్ర పోషించాలని స్థానిక శాసనసభ్యులు టిజెఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలం లోని మద్దిరాలపాడు, చదలవాడ, నాగులుప్పలపాడు, అమ్మనబ్రోలు, అగ్రహారం, నిడమానూరు తదితర గ్రామాల్లో సచివాలయాలను సందర్శించి గృహ సారథులు కన్వీనర్లు వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి నలమలపు అంజమ్మ, సర్పంచ్ లు బత్తుల రవీణ, వడ్డిముక్కల శ్రీను, ఏఎంసి చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఆ పార్టీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, పెనుబోతు రంగారావు, వైస్ ఎంపిపి జాన్సన్ , పి శ్రీమన్నారాయణ, పొద పవన్, శ్రీధర్ కె సుధాకర్, ఎర్రా దశరథ కె త్రినాథ్‌రెడ్డి, కందుల డానియల్, కొండయ్య, కిరణ్, శేషుబాబు, కట్టా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ జయంతి సభ

ప్రజాశక్తి-పర్చూరు

డాక్టర్ బిఆర్ 132వ జయంతి సందర్భంగా పర్చూరు బొమ్మల సెంటర్‌లోని విగ్రహానికి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పిస్తారని మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు తెలిపారు. అనంతరం అంబేద్కర్ కాలనీలోని చర్చి ఆవరణలో అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-పంగులూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో, ఒక పూరిల్లు దగ్ధమైన సంఘటన గురువారం మండలంలోని రామకూరు గ్రామంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. రామకూరు గ్రామంలో షేక్ మస్తాన్ మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మంటలు ఏర్పడి పైకప్పుకు అంటుకున్నాయి. అది గమనించిన మస్తాను చుట్టుపక్కల వాళ్లను పిలిచి మంటలు ఆర్పబోయే సమయానికి పైకప్పు మొత్తం కాలిపోయింది. చుట్టుపక్కల వాళ్లు నీళ్లు చల్లుతూ అద్దంకి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వాళ్లు ఇంట్లో సామాన్లను బయటకు వేశారు. ప్రమాదం వలన సుమారు యాభై వేల రూపాయలు నష్టం జరిగి ఉంటుందని వీఆర్వో బాపయ్య తెలిపారు.

దొరకని మరో యువకుడి ఆచూకీ

- సముద్రంలో గల్లంతయిన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం
- ఇర్ఫాన్ మృతదేహానికి నివాళులర్పించిన కరణం వెంకటేష్
- ఇద్దరూ చీరాల ప్రాంతవాసులు

ప్రజాశక్తి-చీరాల

స్నేహితునితో సరదాగా సేద తీరేందుకు సముద్ర స్నానానికి వెళ్లిన చీరాల ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు సముద్రంలో గల్లంతయిన సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. అందిన వివరాల మేరకు.. చీరాల పట్టణంలోని గంజిపాలేనికి చెందిన ఇర్ఫాన్(16), కూరగాయల మార్కెట్ సమీపాన ఉంటున్న రెహమాన్ ఇద్దరు స్నేహితులు. వీరిద్దరూ బుధవారం సాయంత్రం రామాపురం సముద్ర స్థానానికి వెళ్లారు. అయితే అలల తాకిడికి తట్టుకోలేక ఇద్దరూ సముద్రంలో గల్లంతయ్యారు. అనంతరం కొద్దిసేపటికి ఇర్ఫాన్ మృతదేహం రామాపురంలోని ఓ రిసార్ట్స్ సమీపంలో ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. రహమాన్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కరణం వెంకటేష్ నివాళి

సముద్రంలో గల్లంతయిన గంజి పాలేనికి చెందిన ఇర్ఫాన్ మృతదేహం చీరాల ఏరా వైద్యశాలలో పోస్టుమార్టం

ఇర్ఫాన్ మృత దేహం, గల్లంతైన రెహమాన్ (ఫైల్)

నిమిత్తం ఉండటంతో విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ ఏరియా వైద్యశాలకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఇర్ఫాన్ తల్లిదండ్రులైన షన్ను, బాబులను పరామర్శించారు. మరొక మృతదేహం లభ్యం కాకపోవడంతో సంబంధిత పోలీసులతో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

మట్టి పరీక్షల ఆవశ్యకతను సిబ్బంది గుర్తించాలి: ఏడిఏ

ప్రజాశక్తి-టంగుటూరు

రైతులు తమ పంటల సాగుకు ముందు మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకతను గుర్తించాలని ఒంగోలు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి రమేష్‌బాబు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడిఏ, ఏఓ

గురువారం మండలంలోని మర్లపాడు ఆర్‌బికెలో మట్టి పరీక్షలు-శిక్షణా వారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జి స్వర్ణలత, వ్యవసాయ విస్తరణాధికారులు ఎం వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్రీనివాసులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ఆ డంపింగ్ యార్డును తొలగించండి

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలంలోని కర్లపాలెంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ భవనం ఎదురు వున్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని కర్లపాలెం మండల అంబేద్కర్ సమాజ గౌరవ అధ్యక్షులు పరమానంద కుమార్ అన్నారు. గురువారం కర్లపాలెంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లో అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలని కోరగా అప్పటి నాయకులు 25 సెంట్ల భూమిని ఏర్పాటు చేయగా అందులో భవన నిర్మాణ పనులు కొంతమేర జరుగగా భవనం ఏర్పాటుకు చేసిన నిధులు మురిగిపోవడంతో పనులు సగంలో ఆగిపోయాయని, ప్రస్తుతం బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి చొరవతో అంబేద్కర్ పనులు మరల పున్నప్రారంభం అయ్యాయని అన్నారు. అయితే అంబేద్కర్ భవనం ఎదురుగా వున్న డంపింగ్ యార్డ్‌ను పంచాయతీ అధికారులు వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కర్లపాలెం మండల అంబేద్కర్ సమాజ గౌరవ అధ్యక్షులు పరమానంద కుమార్

ఆందోళన చేపడతామని అన్నారు. అంబేద్కర్ భవన పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సమాజ మండల అధ్యక్షులు ధనుంజయ్, వైసీపీ మండల యూత్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, బెనర్జీ తదితరులు ఉన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో అరుణాచల ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కూడా భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. ఎవరైనా రక్తదానం చేసేవారు ఉంటే ఈ శిబిరానికి రావాలని కోరారు.

వేలం కేంద్రాన్ని సందర్శించిన పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్

పొగాకు వేలం కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-మద్దిపాడు

వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ గురువారం సందర్శించారు. రైతులకు గిట్టుబాటుధర లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పొగాకు బేళ్ల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. గురువారం 1183 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా 1040 కొనుగోలు చేసినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 143 బేళ్లు తిరస్కరించారని తెలిపారు. పొగాకు కిలో గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.160. కిలో సరాసరి రూ.180.26పై. కార్యక్రమంలో బోర్డు మెంబరు మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం నిర్వహణాధికారి సత్యశ్రీనివాసరావు, రైతు నాయకుడు ఎ శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోపం ఉంటే ఫిర్యాదు చేయాలి

ఆకస్మిక తనిఖీలో ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి

ప్రజాశక్తి-మార్కాపురం

బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ జి జయలక్ష్మి మార్కాపురం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలో గల ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో మాట్లాడారు. ఆహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడ పరిశుభ్రతను పరిశీలించారు. నీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులు, మెనూ అమలులో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏదైనా లోపం ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి ఎఎం అంజలి, బిసి సహాయ సంక్షేమ అధికారి షేక్ జబ్బార్, హెచ్‌డబ్ల్యుఒ కె కోటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

మట్టి నమూనా సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-దొనకొండ: మండలంలోని బాదాపురం గ్రామంలో మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం మార్కాపురం ఏడీఏ నిర్మలాదేవి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట భూముల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బొరాన్, మెగ్నీషియం తదితర పోషకాలు ఏ మేర లభ్యత ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుస్తుందని, దీంతో పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలో వివరించవచ్చని అన్నారు. మట్టి నమూనాలు ఎక్కడ తీయాలో, ఎలా తీయాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీ నారాయణ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-దొనకొండ: మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఎంపీటీసీ వై జాన్‌మార్క్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ పోటీల్లో మార్కాపురం, పోలేపల్లి, దూపాడు, పోలేపల్లి జూనియర్స్ జట్లు సత్తా చాటి విజేతలుగా నిలిచాయి. ఎస్‌ఐ ఎం సైదుబాబు, వైసీపీ మాజీ కన్వీనర్ కందుల నారపురెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, జడ్‌పీటీసీ సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి యుటిఎఫ్ సాయం

వెర్రిబాబు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చీరాల

ఉపాధ్యాయులందరికీ యుటిఎఫ్ అన్నివేళలా అండగా ఉంటుందని, వారికి ఆర్థికంగా చేయూతను అందిస్తుందని బాపట్ల జిల్లా యూటీఎఫ్ సహాధ్యక్షులు బిక్షాల బాబు, వీరాంజనేయులు అన్నారు. గత నెలలో వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ గుండెపోటుతో మరణించిన ఉపాధ్యాయుడు వెర్రిబాబు కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి ద్వారా లక్ష యాభై వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కుటుంబ సంక్షేమ నిధి ద్వారా ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయల వరకు చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ నేత దాచూరి రామిరెడ్డి ప్రవేశపెట్టిన కుటుంబ సంక్షేమ నిధి కార్యక్రమం ద్వారా అనేకమంది ఉపాధ్యాయ కుటుంబాలకు నేడు యుటిఎఫ్ అండగా నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజవర్ధన్, రాఘవరావు, సాంబశివరావు, చంద్రారెడ్డి, వీర ప్రసాదరావు, సూరిబాబు, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు హేయం: మందకృష్ణ

మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

సైన్సు అభివృద్ధి చెంది ప్రపంచం ముందుకు వెళుతున్నప్పటికీ అగ్రవర్ణాలు దళితులపై అనాగరికంగా దాడులు చేయటం హేయమైన చర్య అని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాప కులు మందా కృష్ణ మాదిగ అన్నారు. కొల్లూరు మండలం చింత ల్లాంక, పెదలంక గ్రామాలలో గురువారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అగ్ర కులాలైన, కమ్మ, కాపు, రెడ్డి సామాజికవర్గం ఉన్న ప్రాంతాలలోనే దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. చింతల్లాంక, పెదలంక గ్రామాల దళితులపై అగ్రవర్ణాలు పోలీసులు, రెవెన్యూ అధికారుల సాక్షిగా దాడులు చేస్తే అట్టి వారిపై అట్రాసిటి కేసులు పెట్టాల్సిన అధికారులు బెయిలబుల్ కేసులు పెట్టి బాధితులపై బలమైన సెక్షన్లు నమోదు చేయటం ఈ రాజకీయ పార్టీల ఎత్తుగడలలో భాగమన్నారు. తొలుత కొల్లూరు నుంచి నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున ర్యాలీగా లంక గ్రామాలకు తీసుకువచ్చి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల ఏఎంసి ఛైర్మన్‌గా సీతారామిరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా కర్లపాలెం మండల వైసిపి కన్వీనర్ డి సీతారామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఛైర్మన్‌తో పాటు బాపట్ల ఏఎంసీ డైరెక్టర్లుగా పిన్నిబోయిన ప్రసాద్, సలీం బేగ్, సంగాని సాంబయ్య, వేల్పుల మీరాబి, కూచిపూడి శామ్యూల్ జాన్, జోగి రాజేశ్వరి, దోప్పలపూడి మాధవి, నర్రా ధనలక్ష్మి, బడుగునద్దులమ్మ, కుంటా నాగమణి, ఇట్లా జ్యోతి, నాగవరపు కృష్ణమూర్తి, తటవర్తి వెంకట సాయి లక్ష్మి శిరీష, తూనుగుంట్ల శ్రీనివాసరావులను నియమిస్తూ తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

పాలకుల ప్రజాకంటక విధానాలపై

పోరాటం చేయాల్సిందే..

సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి-బాపట్ల

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజాకంటక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాసంఘాలు పోరాటం చేయాలని సిపిఎం, సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శులు సిహెచ్.గంగయ్య, తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. గురు వారం బాపట్ల సిపిఐ కార్యాలయంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి దేశాన్ని కాపాడండనే నినాదంతో ఏప్రిల్ 14 నుండి 30 వరకు దేశ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రచార భేరి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టడానికి సిపిఎం, సిపిఐ చేసే పోరాటాలు, ఉద్యమాల ప్రచార భేరికి సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అధికార పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీలు చిన్న మాట కూడా బిజెపిని అనలేని స్థితిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మామిడి బత్తుల అశోక్, సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని ఇందిరమ్మ కాలనీ, పులివెంకటరెడ్డి కాలనీలలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. రోడ్డు, కాల్వల శుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట శానిటరి ఇన్స్పెక్టర్ షేక్ బాబ్జీ, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై యర్రగొండపాలెం ఎస్సై జి కోటయ్య గురువారం వాహన దారులకు అవగాహన కల్పించారు. 565 జాతీయ రహదారి పై వచ్చి పోయే వాహనాలను నిలిపి డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కోటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను గుర్తించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెంచు గిరిజనులకు ఉపాధి హామీ పనులను గుర్తించి వారికి అవసరమైన పనులు కల్పించాలని మార్కాపురం ఏపిడి రాజారావు అన్నారు. గురువారం యర్రగొండపాలెంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలోని హైస్కూల్ నందు జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రాజెక్టు మేనేజర్ కెజె నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని వెంగళాయపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ గడ్డం రాంబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కరణం మహాలక్ష్మయ్య పాల్గొన్నారు.

పిఎంసిఎ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని పిఎన్‌సిఏ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్‌తో పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమం మొదలుపెట్టారు. సోమరాజుపల్లిలో ఈ స్పెషల్ క్యాంపును గురు వారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్కె సుభాని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో ఛైర్మన్ పి శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ గీతారాణి, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.

మట్టి నమూనా సేకరణలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

రైతుల పంట పొలాలలో మట్టి నమూనా సేకరణలు చేపట్టాలని సేకరణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి యేరువా రామ్మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపురం ఆర్‌బికె నందు గ్రామ సహాయకులకు మండల మండల స్థాయి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

బుంగబావి చెరువు ప్రతిష్ఠను కాపాడతాం..

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని చరిత్ర కలిగిన బుంగబావి చెరువు ప్రతిష్ఠను కాపాడతామని, చెరువు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని సర్పంచ్ వనజ తెలిపారు. గురువారం బుంగబావిని పరిశీలించి అక్కడ అధికారులతో సమీక్ష జరిపారు. సర్పంచ్ వనజ బుంగ బావి చెరువును సందర్శించి.. అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం-2 సెక్రటరీ సుశీల, నాయకులు రాజు వెంకటేశ్వర్‌రెడ్డి (స్వాములు), సవలం కోటేశ్వరరావు, జాన్ కిషోర్, ప్రణయ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21న యర్రగొండపాలెంలో పర్యటించనున్నారు. పర్యటనను జయప్రదం చేయాలని కోరుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం మండలంలోని కొత్తూరుతో పాటు అన్ని గ్రామాలలో పర్యటించారు. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు మాబు, భట్టు సుధాకర్‌రెడ్డి, కొప్పుల సుబ్బారెడ్డి, సేతు నాగేంద్రబాబు, చంటి, శేషాద్రి, విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

గొడుగులు అందజేస్తున్న జవహర్, బదరీనారాయణ

'లయన్స్' గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

వేసవి దృష్ట్యా పాదరక్షల పనివారలకు, తోపుడు బండ్ల చిరువ్యాపారులకు చీమకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ గొడుగులు గురువారం పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీమకుర్తి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్, అధ్యక్షులు చలువాది బదరి నారాయణ చేతుల మీదుగా గొడుగులు అందజేశారు. గురువారం రూ.10 వేల విలువైన గొడుగులు అందజేశామని, త్వరలో మిగిలిన వారికి కూడా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి చలువాది రమేష్, వెల్లంపల్లి రంగారావు, పూనాటి ధనలక్ష్మి, జె.యాకోబు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు బలప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల స్థాయిలో పశు బలప్రదర్శన పోటీలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల ప్రాంగణం వేదిక కానుంది. శుక్రవారం ప్రారంభం రోజున న్యూ కేటగిరి విభాగంలో బండ లాగుడు పోటీలు జరుగుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-పామూరు

డంపింగ్ యార్డ్ స్థలంలో అక్రమంగా సరిహద్దు రాళ్లు పాతిన అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తహశీల్దార్ జ్వాలా నరసింహారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలపర్తి వెంకటేశ్వర్లు, షేక్ రహంతుల్లా, ప్రభాకర్‌చౌదరి, ఇర్రి కోటిరెడ్డి, ఎం రమణయ్య, వీరబాబు, రామారావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు స్థలాన్ని

ఆక్రమిస్తే ఉద్యమం తప్పదు

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

స్థానిక నెల్లూరు రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డు స్థలాన్ని ఆక్రమిస్తే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. గురువారం ఆక్రమణకు గురైన స్థలాలను సిపియం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ పామూరు పట్టణానికి అందుబాటులో ఉన్న సర్వే నెంబరు 347/2 రులో య.6.50 సెంట్ల భూమిని ఆనాటి ప్రభుత్వాలు డంపింగ్ యార్డుగా నిర్ణ హించాయన్నారు. డంపింగ్‌యార్డు పక్కనే మాగజీవాల నీటి అవసరాల కోసం నీటిగుంట (మీసాలవారిగుంట)ను తవ్వించి అప్పటి నుండి నేటివరకు పంచాయతీ వాహనాల ద్వారా బజారులో సేకరించిన చెత్తను కుంట దగ్గరలో ఉన్న స్థలంలో డంపింగ్ చేసేవారని చెప్పారు. విరాట్‌నగర్‌కు ఆనుకున్న ఈ డంపింగ్ స్థలాన్ని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం సరైంది కాదన్నారు. ఆ స్థలాన్ని డంపింగ్ యార్డుగా ఉపయోగించుకోవాలని డిమాండ్ చేశారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని వదిలివేసి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిలకపాడు భూములలో చెత్తను వేయడం సరైంది కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు గతంలో ఉన్న స్థలంలోనే చెత్తచెదారం వేసేందుకు ఉన్న స్థలాన్ని కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి కె. మాల్యాద్రి, షేక్ మహబూబ్‌పీరా, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, వై వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

మాటల్లోనే దళితోద్ధరణ

- వైసిపి పాలనలో దాడులు, అవమానాలు
- దాడులకు వ్యతిరేకంగా కెవిపిఎస్ పోరాటాలు
- నేడు అంబేద్కర్ 132వ జయంతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో దళిత ఉద్ధరణ కేవలం మాటలలోనే కనిపిస్తోంది. గత నాలుగేళ్ల వైసిపి పాలనలో దళితులపై దాడులు, అవమానాలు పెరిగిపోయాయి. కుల వివక్ష, దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం(కెవిపిఎస్) పోరాటాలు చేస్తోంది. బాధితులకు అండగా నిలిచి వారి పక్షాన పోరాడుతోంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని కెవిపిఎస్ ఆధ్వర్యంలో సాగిన పోరాటాలు మననం చేసుకుందాం.

జిల్లాలో మాస్క్ పెట్టుకోలేదని చీరాల ఎరిచర్ల కిరణ్, సింగరాయకొండ మండలం, మూలగుంటపాడు దళితులపై దాడి, కొండపి మండలం, పెరిదేపి గ్రామ దళితులు సోలసా రాంబ్రహ్మయ్య హత్య, దళిత టీచర్ ఇంటికి దారిలేకుండా పెత్తందారులు గోడ నిర్మాణం చేయడం, సి.ఎస్.పురం ఏకునాపురం దాసరి వెంకటరమణయ్య హత్య వంటి చోటుచేసుకున్నాయి. వైసిపి ప్రభుత్వం దళిత ప్రభుత్వమని చెప్పుకుంటూ వారికే తీవ్ర అన్యాయం చేస్తోంది. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించి అనుసరిస్తోంది.

జిల్లాలో దళిత, గిరిజనుల స్థితిగతులు

జిల్లాలో దళిత కుటుంబాలు సుమారుగా 1.5 లక్షలు వున్నాయి. అందులో 30 వేల కుటుంబాలకు ఎంతో కొంత భూమి ఉంది. అత్యధికులు వ్యవసాయ కార్మికులుగా వున్నారు. మొత్తం 734 పంచాయితీలుండగా అందులో 400 దళితవాడలకు శ్మశానాలు లేవు. సబ్ ప్లాన్ నిధులు ప్రకటనలకే పరిమితమౌతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ విభజన అనంతరం అలంకార ప్రాయమైంది. జిల్లాలో నేటికీ ఏదో ఒక ప్రాంతంలో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు కొనసాగుతూనే వున్నాయి.

అమలుకు నోచుకోని అట్రాసిటీ చట్టం

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 సెప్టెంబర్ 11న అమలులోకి వచ్చినప్పటి నుండి నేటికీ 33 ఏళ్లు పూర్తయినా సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. ప్రతినెలా 30న, ఫిబ్రవరి 28న తేదీల లో పౌరహక్కుల దినం జరపాలని వున్నా, ఎక్కడా అమలు కాలేదు.

దళితులకు దరిచేరని పథకాలు

రాష్ట్రంలో షెడ్యూల్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం కార్యక్రమాలను చేపట్టే ఉద్దేశంతో 1974 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ 23 జిల్లాల్లో ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ రెండుగా విభజించబడి 13 జిల్లాలతో కూడిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ 2014 జూన్ 2న హైదరాబాద్‌లో ఆవిర్భవించింది. ఆదాయం సమకూర్చే ఆస్తులను కల్పించేందుకు నిరుద్యోగ యువతీయువకులకు స్వయంవేతన ఉపాధికి దోహదపడే నైపుణ్యం పెంపుదల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం సంస్థ ఉద్దేశం. దళితుల అభివృద్ధికోసం ఆన్‌లైన్ బెనిఫిసరి మానిటరింగ్ అండ్ మేనేజ్మెంట్ సిస్టం (ఒబిఎంఎంఎస్) స్వయం ఉపాధి, బ్యాంకు సబ్సిడీ విధానం, పశుసంవర్ధక పథకాలు, చిన్నతరహా సాగునీటి పథకాలు, భూమి కొనుగోలు పథకం, వెట్టిచాకిరీ, కూలీలు, ఎన్ఎస్ఎఫ్ఎడిసి, ఎన్ఎస్ఎఫ్ఎసి పలు రకాల పథకాలు అభివృద్ధి కోసం ఉన్నాయి. ఇవన్నీ నేడు ఎక్కడా అమలు లేదు.

దళితుల సమస్యల పరిష్కారంకోసం ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నేతలు (ఫైల్)

పోరాటాలకు సిద్ధమవుదాం

బి.రఘురామ్ కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కుల వివక్ష, దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడదాం. అడిగిన వారికి పని కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం మరోసారి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి నాడు ప్రతిన బూనదాం..పోరాటాలకు సిద్ధమవుదాం..

అధికార పార్టీ నేతల దోపిడీ

- సహజ వనరులను దోచేస్తున్నారు
- అవగాహన లేని సీఎంతో ప్రజల బెంబేలు
- అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

అధికార పార్టీ నేతలు అడ్డూ అదుపూ లేకుండా సహజ వనరులను దోచుకుంటున్నారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామంలో అనుమతులు లేకుండా డ్రెజ్జర్ల సహాయంతో ఇసుకను తోడుతున్న నది పరివాహక ప్రాంతాన్ని తెలుగు దేశం పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఇసుకాసురులు పనులు నిలిపివేసి అందుబాటులో లేకుండాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అవగాహన లేని ముఖ్యమంత్రి పాలనతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని, అధికారం వచ్చిన నాటి నుంచి నేటి వరకు వైసిపి నాయకులు జేబులు నింపుకునే పనిలో నిమగ్నమై ఉండటం వల్ల ప్రజలకు ఈ దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. వైసిపి నేతల కనుసన్నల్లోనే భారీ డ్రెజ్జర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకేనా జగన్‌రెడ్డిపై నమ్మకం ఉంచుకోవాలి అంటూ ఎద్దేవా చేశారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలో ఇసుకను తోడుతూ పెద్ద పెద్ద డంపర్లు ట్రక్కులతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, పెద్దఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయని పేర్కొన్నారు. చిన్నపాటి లోయల్లా దర్శనమిస్తున్న ఇసుక గుంతలే ఇందుకు తిరుగులేని సాక్ష్యాలని అన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను బూచిగా చూపెడుతూ మాయ మాటలు చెబుతున్నారని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు కడుతున్న ఇళ్ళు ఎన్ని? కావాల్సిన ఇసుక ఎంత? ఇప్పటివరకు తోడిన ఇసుక ఎంత? అని అడిగితే సమాధానం చెప్పే నాథుడే లేడన్నారు. కొరిసపాడు ఎత్తిపోతల పథకం తమ్మవరం లిఫ్ట్ కాలువలను ఇసుక మాఫియా పూడ్చితే అధికారులు కిమ్మనకుండా ఉండటం ఏంటని ప్రశ్నించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి దాదాపు పది నెలలు కావస్తున్నా ఇంతవరకు పూర్తి స్థాయిలో గేట్లు అమర్చకపోవడం ఈ ప్రభుత్వం రైతులు, ప్రజల పట్ల ఆసక్తి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అధికార పార్టీ నేతలు ఇసుకను తరలించడం కోసమే ఒక పథకం ప్రకారం ప్రాజెక్టు గేట్లు దెబ్బతినేలా వ్యవహరించారా అన్న అనుమానం కలుగుతోందని ఆయన అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద దాదాపుగా లక్ష ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించడమే కాకుండా వేలాది మంది మత్స్యకారులు జీవనం సాగిస్తుండేవారన్నారు. వైసిపి ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధిపై కోలుకోలేని దెబ్బకొట్టిందని ఆయన అన్నారు. ఇసుకను తోడుతున్న విషయాన్ని స్థానిక గ్రామ ప్రజలు మీ దృష్టికి తీసుకువచ్చినా ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రాజెక్టు అధికారిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దివంగత యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల జలాశయ కాలువను పూడ్చినవారిపైన చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులను నిలదీశారు. ఇలాంటి చర్యల వలన ప్రాజెక్టు దెబ్బతినే ప్రమాదం ఉందని, వెంటనే వాహనాలను ఇక్కడ నుంచి తరలించేలా చర్యలు చేపట్టాలని, లేనిచో ప్రజలకు మద్దతుగా జాతీయ రహదారి దిగ్బంధం చేసేందుకు వెనుకాడబోమని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక తోడుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు

ప్రాంగణ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధిపతులు

ప్రాంగణ ఎంపికల్లో జోరు

ప్రజాశక్తి-బాపట్ల

కళాశాల ప్రాంగణ ఎంపిక ఉద్యోగ నియామకాల్లో బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జోరు కొనసాగిస్తున్నారు. గురువారం కళాశాలలో జరిగిన ప్రాంగణ ఉద్యోగ ఎంపికలో వ్యవసాయ ఇంజనీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు సురేంద్ర, డి హర్షవర్ధన రెడ్డి ఒక్కొక్కరికి రూ.6.50 లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డిడి స్మిత తెలిపారు. అదేవిధంగా థాన్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నియామకాల్లో రూ.4.50 లక్షల వార్షిక వేతనానికి వ్యవసాయ ఇంజనీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు సురేంద్ర, టి వాణిశ్రీ, ఉషశ్రీ, భార్గవి, చాందిని ప్రియ, వెంకట సాయి, నాగ దీక్షిత్, సాయి చరణ్ తేజ, మహేశ్వరి దేవి, విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. గతంలో జరిగిన ప్రాంగణ ఎంపికలో టాఫ్ ట్రాక్టరు కంపెనీలో బిటెక్ వ్యవసాయ ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపిక అధికారి ఎస్ విష్ణువర్ధన్, ఆచార్యులు, అధిపతులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణమూర్తి

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన ఎంపీడీవో

ప్రజాశక్తి-పంగులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు, గురువారం పంగులూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఎంపీడీవో రమణ మూర్తి పరిశీలించారు. మొదటగా పంగులూరు సచివాలయం-2ను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి బాలబాలికల విద్యాభ్యాసం, భోజనం, వసతులు పరిశీలించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి నిర్మాణం వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచనలు చేశారు. పంగులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి లాం సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండమంజులూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావను అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు రాగి జావ

ప్రజాశక్తి-పంగులూరు

విద్యార్థులకు పోషకాలతో కూడిన రాగి జావను అందిస్తున్నట్లు, కొండమంజులూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలపర్తి తిరుపతయ్య తెలిపారు. గురువారం ఉదయం పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన విలేకరుల బృందంతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో 74 మంది విద్యార్థులు ఉన్నారని, ఇంకా తల్లిదండ్రులు పనుల కోసం వలస పోవడం వలన కొంతమంది విద్యార్థులు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు రోజు మార్చి రోజు రాగి జావ ఇస్తున్నామని చెప్పారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి 10 గంటల సమయంలో రాగిజావను ఒక్కొక్కరికి ఒక గ్లాసు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. రాగిజావ తాగటం వలన విద్యార్థులలో రక్తహీనత తగ్గిపోతుందని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా, నీరసం లేకుండా ఉంటారని తిరుపతయ్య అన్నారు. ప్రభుత్వం రాగిపిండి, బెల్లం ఇస్తుందని ఆయన చెప్పారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, మంచి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని కూడా మధ్యాహ్న భోజనంగా ఇస్తున్నామని చెప్పారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం

సీజనల్ వ్యాధులు, వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రణవి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ నక్షత్రనగర్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి మాత్రలు అందించారు. గర్భిణులు, చిన్న పిల్లలు, బాలింతలలో ఐరన్ స్థాయి చూసి తక్కువ ఉన్నవారికి టాబ్లెట్స్ ఇచ్చారు. ఆరోగ్య సమస్య తీవ్రత పెరిగినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించాలని వైద్యురాలు ప్రణవి సూచించారు. పీహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. ఆశ వర్కర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సమస్యలను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సామాజిక సేవలో రోటరీ అన్ని వేళలా ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు కొప్రపాటి కాజారావు, కుర్రా వెంకట రామయ్య అన్నారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో చిన్మయా మిషన్ వద్ద రోటరీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన 70 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ నివారణకు ప్రపంచ వ్యాప్తంగా రోటరీ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ బాబు, రోటరీ యూత్ చైర్మన్ రావి అంకమ్మ చౌదరి, జాష్టి సాంబశివరావు జాష్టి కోటేశ్వరరావు, చింతల సుబ్బారావు, చెరుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమృతలూరు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం అమృతలూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ శంకుస్థాపన చేస్తారని ఎంపిడిఓ షేక్ మహబూబ్ సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలతో అలంకరణ కార్యక్రమంతో పాటు, 132వ జయంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ అంబేద్కర్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యత అని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు ఇంకొల్లులో భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇంకొల్లులో జై భీమ్ జై తెలుగుదేశం పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభకు పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, కొండేపి శాసనసభ్యులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న దాడులు హత్యలను నిరసిస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి, చైతన్యం నింపేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మండలంలోని టిడిపి నాయకులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయీబ్రాహ్మణులు

ప్రజాశక్తి-అద్దంకి: చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నివాసంలో గురువారం అద్దంకి పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కుందారపు రామారావు, కాకాని అశోక్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణ, నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు అద్దంకి ఏడుకొండలు, గుడిపాటి శ్రీను, బాపయ్య, తాళ్లూరి గాంధీ, గుడిపాటి నాగేశ్వరరావు, పోలవరపు శ్రీను, జాగర్లమూడి శ్రీనివాసరావు, దేవరపల్లి సురేష్ పాల్గొన్నారు.

పెదపులివర్రులో 'జగనన్నే మా నమ్మకం'

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రు పంచాయతీలోని జీలుగువారిపాలెంలో గురువారం జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి డివి లలితకుమారి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులకు అందజేయబడిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్వరరావు, డ్వాక్రా మహిళలు ఉన్నారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్రం

- మతోన్మాద విధానాలపై పోరాడాలి
- ప్రచార భేరీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన వామపక్ష నేతలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తునన వామపక్షాల నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోలవరం ప్రాజెక్టుకు, కడప ఉక్కు ఫ్యాక్టరీకి, రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు విమర్శించారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుండి 30 వరకు వామపక్షాలు చేపట్టిన ప్రచార భేరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు ప్రయత్నించటం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ముడి సరుకు గనులు కేటాయించడం చేతకాని కేంద్ర ప్రభుత్వానికి ఫ్యాక్టరీని అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిర్వహిస్తున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ నెల 14న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ప్రారంభ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా అమ్మి ఈపాటికి నౌకాశ్రయాలు, విమానాశ్రయాలతో పాటుగా సముద్ర తీరాన్ని అదానీకి దోచి పెట్టారన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు రెండు వేల కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి అభివద్ధికి నిధులు కేటాయించాలని, కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిమ్జ్, దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్, జిల్లాలో విమానాశ్రయం, పేపర్ మిల్లును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి పాల్గొన్నారు.

బిజెపికి ప్రజలే బుద్ధి చెప్పాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య

ప్రజాశక్తి-పామూరు

మతోన్మాదాన్ని రెచ్చగొట్టే బిజెపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య అన్నారు. సిపిఎం మండల కమిటీ సమావేశం కె.శంకర్ అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వై.సిద్ధయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు దేశసంపదను కట్టబెట్టేం

మాట్లాడుతున్న సిద్ధయ్య

దుకు కంకణం కట్టుకుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకంగా సిపియం, వామపక్షాలు ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి ప్రచార భేరి కార్యక్రమం, ఈ నెల 24న వామపక్షాల ఆధ్వర్యంలో కనిగిరిలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు షేక్ మీరావలి, కె.మాల్యాద్రి, షేక్ అల్లాబక్షు, చల్లా వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, మహదేవయ్య, షేక్ గౌస్‌బాష, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.